క్లుప్తంగా

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ రేసవానిపాలెం వద్ద మొదలై సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఇతర అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబ, మల్లికార్జునస్వామి పరస



పరసలో భక్తుల కోలాహలం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు రామాటాకీస్ దరి శ్రీనగర్ కాలనీలో గల శ్రీ శివాలయంలో భ్రమరాంబ, మల్లికార్జున స్వామిల పరస మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఘనంగా పరస జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. శ్రీనగర్, రామాటాకీస్, ఆశీలమెట్ట, అశోక్‌నగర్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పరసలో పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ అమ్మవారి ఉత్సవాలకు శ్రీకారం



జగదాంబ దరి ఎల్లమ్మ ఆలయానికి తరలి వెళ్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలకు శుక్రవారం రథ సప్తమి సందర్భంగా శ్రీకారం చుట్టారు. మార్చి 5,6,7 తేదీల్లో అమ్మవారి 25వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గౌరవాధ్యక్షుడు, ఫౌండర్ పీల వెంకటప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, కార్యదర్శి బొడ్డు పోలారావు, పంపాన గణేష్, బడే నాగరాజు, దున్నబోయిన సత్యనారాయణ, పాకలపాటి అప్పారావు, ఎస్.సత్తిబాబు, కె.సత్తిబాబు, అచ్చియ్యమ్మపేట గ్రామ పెద్ద కుంచపు ఆదినారాయణ (మౌనీ) తదితరులు పాల్గొని అమ్మవారి ఉత్సవాలకు ముడుపు కట్టారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి కామేశ్వరశర్మతో కలిసి జగదాంబ దరి యల్లమ్మ అమ్మవారి దేవాలయానికి వెళ్లి పసుపు, కుంకుమలు అందజేసి పండగ కోసం అనుమతి తీసుకున్నారు.



కైలాసగిరిపై నిలిచిపోయిన విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్

నగరంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రం.. విదేశీయులను సైతం ఆకర్షించే కైలాసగిరిపై సందర్శకులకు మరపురాని అనుభూతిని అందించే టాయ్ ట్రైన్.. విశాఖ దర్శన్. ఓ వైపు సముద్రం.. మూడు వైపులా నగర అందాలు, కొండలు కనువిందు చేస్తుండగా ఒకటిన్నర కిలోమీటర్ల ఈ ప్రయాణం వారికి వినోదాన్ని పంచుతుంది. 14 సంవత్సరాలుగా సందర్శకులను ఆకట్టుకుంటున్న ఈ టాయ్ ట్రైన్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో మూలకు చేరింది. దీంతో పర్యాటకులు నిరాశ చెందుతున్నారు.

పట్టాలెక్కని విశాఖ దర్శన్

- కైలాసగిరిపై మూలకు చేరిన టాయ్ ట్రైన్
- నిరాశ చెందుతున్న సందర్శకులు
- పట్టించుకోని వీఎంఆర్‌డీఏ అధికారులు

ఆరిలోవ: కైలాసగిరిపై టాయ్ ట్రైన్ విశాఖదర్శన్ మూలకు చేరింది. ఈ ట్రైన్ ప్రస్తుతం మరమ్మతులకు గురవడంతో వీఎంఆర్‌డీఏ అధికారులు దీన్ని నడపకుండా నిలిపేశారు. నిర్వహణలోపంతో మూలకు చేరిన ఈ ట్రైన్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనే దానిపై కూడా ఎవరికీ స్పష్టత లేదు.

అంతా అస్తవ్యస్తం

ట్రైన్ ఇంజిన్‌లో కొన్ని భాగాలు పాడయ్యాయి. ఈ ట్రైన్ నడిచేందుకు సహకరించే జనరేటర్ కూడా మొరాయించింది. దీంతో ఏసీ పనిచేయడం లేదు. బోగీల లోపల ఫ్యాన్‌లు తిరగడం లేదు. బోగీలో సందర్శకులు కూర్చునే సీట్లు సుమారు సగం వరకు చిరిగిపోయాయి. కొన్ని సీట్లు చిరిగిపోగా, ఇంకొన్ని సీట్లుకు అమర్చిన బోల్టులు ఊడిపోయి, పాడయ్యాయి. దీంతో పాటు బోగీల చక్రాలు కూడా మరమ్మతులకు గురైనట్లు సమాచారం. జనరేటర్ మరమ్మతులకు గురికావడంతో నడిచేటప్పుడు పట్టాలు తప్పే ప్రమాదం ఉందన్న సంగతి గమనించిన వీఎంఆర్‌డీఏ అధికారులు పూర్తిగా నిలిపేశారు. ఇది తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతుదనే దానిపై వీఎంఆర్‌డీఏ అధికారుల్లోనూ స్పష్టత లేదు. దీంతో సందర్శకులకు ప్రస్తుతం ఇది దూరమైంది. సందర్శకులను ఎంతో ఆకట్టుకునే ఈ ట్రైన్‌పై వీఎంఆర్‌డీఏ అధికారులు దృష్టి సారించాలని, వేగంగా మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ట్రైన్‌లో మూడు బోగీలున్నాయి. వాటిలో ఒకటి ఏసీ బోగీ కాగా .. రెండు నాన్ ఏసీ. ఏసీ బోగీలో ప్రయాణించడానికి పెద్దలకు రూ.170, పిల్లలకు (4 నుంచి 8 సంవత్సరాల లోపు వారికి) రూ.120, నాన్ ఏసీ బోగీలలో ప్రయాణించడానికి పెద్దలకు రూ.120, పిల్లలకు రూ.100 టిక్కెట్ చెల్లించాలి.



టాయ్ ట్రైన్‌లో చిరిగిపోయిన సీట్లు

అధికారుల నిర్లక్ష్యం

ఎంతో వినోదం పంచే ఈ ట్రైన్‌పై వీఎంఆర్‌డీఏ అధికారులు నిర్లక్ష్యం చూపడం వల్లే మూలకు చేరిందనే విమర్శలు సందర్శకుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రారంభం నుంచి వీఎంఆర్‌డీఏ పీపీపీ పద్ధతిలో ఓ ప్రైవేట్ వ్యక్తికి దీని నిర్వహణ బాధ్యత అప్పగించింది. సరిగ్గా లీజు డబ్బులు చెల్లించలేదనే కారణంతో సుమారు ఏడాదిన్నర క్రితం అధికారులు ఆ ప్రైవేట్ వ్యక్తిని తప్పించినట్లు తెలిసింది. అప్పటి నుంచి వీఎంఆర్‌డీఏ అధికారులే దీన్ని నిర్వహిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందిని ఇక్కడ నియమించారు. వారు దీని టిక్కెట్ల విక్రయంలో చిలక్కొట్టుడు కారణంగా నిర్వహణ ఖర్చులు కూడా రావడంలేదని సమాచారం. ఇక్కడ సిబ్బంది కొందరు సందర్శకుల నుంచి డబ్బులు తీసుకుని టిక్కెట్లు ఇవ్వకుండా ట్రైన్ ఎక్కించేవారనే విమర్శలు ఉన్నాయి. దీంతో పాటు ట్రైన్‌లో సౌకర్యాలు, ట్రైన్ మెయింటెనెన్స్‌ను కూడా పట్టించుకోలేదు. అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో ఇప్పుడు మరమ్మతుల పేరుతో మూలకు చేర్చాల్సిన పరిస్థితి వచ్చిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖైదీల సమస్యలు తెలుసుకున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు



కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో కలిసి ఖైదీల బేరక్‌లను పరిశీలించారు. రిమాండ్, శిక్ష అనుభవిస్తున్న ఆదివాసీ ఖైదీలతో మాట్లాడారు. జైలులో సమస్యలైమేనా ఎదురవుతున్నాయా అని తెలుసుకున్నారు. విడుదలైన అనంతరం సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు.

ఏయూ సందర్శన

విశాఖ సిటీ: రాష్ట్ర ఎస్టీ కమిషనర్ సభ్యుడు శంకర్‌నాయక్ మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈసీ సమావేశ మందిరంలో ఏయూ అధికారులతో సమావేశమయ్యారు. ఏయూలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఏవైనా సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.శశి భూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ ఆచార్య బసవయ్య, ప్రొఫెసర్లు జర్ర అప్పారావు, అరుణ్ కుమార్, బి.పడాల్, బలరాం పడాల్, కుంజం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నగదు ప్రోత్సాహకాలను అందించారు. కళాశాలలో అంధ విద్యార్థులకు రోటరీ క్లబ్ విశాఖపట్నం వారు నగదు ప్రోత్సాహకాలు, స్మార్ట్ గ్లాసెస్ అందజేశారు. హెల్ప్ ద బ్లైండ్ ఫౌండేషన్‌కు చెందిన శివాజీ రావు మాట్లాడుతూ అంధ విద్యార్థులకు తోడ్పాటు అందించి, వారి విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయ బాబు అధ్యక్షతన రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ ప్రతినిధి ఎం.వి.నారాయణ రావు మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జయ, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి.ధనలక్ష్మి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ కె.రవిబాబు, అకాడమిక్ కో–ఆర్డినేటర్ ఎం.రాజేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చారు..

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ మధ్య ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులను జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు మంగళవారం పూడ్చారు. నాలుగు రోజుల క్రితం ఆలయం సమీపంలో రోడ్డు పక్కన నీటి సరఫరా పైపు లైన్ లీకైంది. దీంతో జీవీఎంసీకి చెందిన ముడసర్లోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది ఆ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపై ఏర్పడిన సుమారు నాలుగు అడుగుల లోతైన గొయ్యితో పాటు సిబ్బంది చేపట్టిన పనులలో భాగంగా తవ్విన గొయ్యిని పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. ఇవి పాదచారులు, వాహనచోదకులకు ఇబ్బందిగా నిలిచాయి. దీనిపై 'పనులు చేశారు.. గోతులు వదిలేశారు' శీర్షికతో సాక్షిలో మంగళవారం ప్రచురించిన కథనానికి నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించారు. వెంటనే సిబ్బందితో రోడ్డుపై ఏర్పడిన లోతైన గొయ్యిని మట్టి, రాళ్లతో పూడ్చారు. ఫుట్‌పాత్‌పై గొయ్యిపై పలక అడ్డు పెట్టారు. దీంతో పాదచారులు, వాహనచోదకులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



చినగదిలి సాయిబాబా ఆలయం పక్కన రోడ్డుపై పూడ్చిన గొయ్యి

గెడ్డలో పేరుకుపోయిన పూడిక

వ్యర్థాలతో నీటి ప్రవాహానికి అంతరాయం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపాన్ని ఆనుకుని ఉన్న ఓ గెడ్డలో పూడిక భారీగా పేరుకుపోయింది. కొంతకాలంగా ఈ గెడ్డలో పూడిక తీయక పోవడంతో ప్రధానంగా ఈ సమస్య తలెత్తింది. వ్యర్థాలు భారీగా కొట్టుకురావడం, పక్కనే ఉన్న కల్వర్ట్ వద్ద నిలిచిపోవడంతో పూడిక పెరిగిపోయింది. దీంతో అక్కడ నీరు ప్రవహించే వీల్లేకుండా ఉంది. కొద్దికాలంగా ఇదే పరిస్థితి ఉన్నా జీవీఎంసీ అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టకపోవడంతో రోజురోజుకూ సమస్య జఠిలమవుతోందని స్థానికులు వెల్లడిస్తున్నారు. ప్రవాహం నిలిచిపోయిన కారణంగా వ్యర్థాలు దుర్వాసన వెదజల్లడంతో భరించలేకపోతున్నామని స్థానిక వ్యాపారులు తెలిపారు. కాలనీలోని పలు గెడ్డల్లో పరిస్థితి ఇలానే ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డలలో పూడిక తొలగించి, మురుగు సాఫీగా ప్రవహించేలా చూడాలని కోరుతున్నారు. అయితే ఆ గెడ్డను ఆనుకొని, కల్వర్ట్ చుట్టూ పలువురు వ్యాపారుల షాపులు ఉండటంతో వ్యర్థాల తొలగింపు ఎలా సాధ్యమనే ప్రశ్న వ్యక్తమవుతోంది.



వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో ఆగిపోయిన నీటి ప్రవాహం

నమో.. సూర్యదేవా



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

- శ్రీకృష్ణాపురంలో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు
- భక్తులతో కిక్కిరిసిన ప్రాంగణం
- వేడుకగా రథసప్తమి

ఆరిలోవ: రథసప్తమి పర్వదినం సందర్భంగా సూర్య భగవానుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురం వద్ద సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూర్యదేవుని ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. ఇక్కడ సప్తాశ్వాల రథంపై కొలువుదీరిన సూర్య భగవానుడిని వందలాదిమంది భక్తులు దర్శించుకున్నారు. నగరంలో ఇదొక్కటే సూర్య దేవాలయం కావడంతో నలుమూలల నుంచి భక్తులు వచ్చారు. స్వామి దర్శనం కోసం బారులు తీరారు. గోపాలపట్నం, సింహాచలం, వేపగుంట, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ, ఆరిలోవ, విశాలాక్షినగర్, మద్దిలపాలెం, ఎంవీపీకాలనీ, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాలతో పాటు భీమిలి, ఆనందపురం, రుషికొండ, ఎండాడ, పెందుర్తి, సబ్బవరం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయన ఆవరణలోని రావిచెట్టు, వేపచెట్ల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల వాహనాలతో ఇక్కడి బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు నిండిపోయింది. భక్తులకు ఇబ్బంది కలకుండా ఆరిలోవ పోలీసులు ముందు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహించారు. పలువురు సామాజిక కార్యకర్తలు భక్తులకు ప్రసాదం, మంచినీరు సరఫరా చేశారు.



శ్రీకృష్ణాపురం వద్ద ఏడు గుర్రాల రథంపై సూర్య భగవానుడు

టీటీడీ ఆధ్వర్యంలో ..

ఎంవీపీకాలనీ: హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, డీపీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఎంవీపీ కాలనీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ వేడుకలు జరిగాయి. తొలుత శ్రీసూర్యనారాయణ స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ సిటిజన్స్‌తో సూర్యనమస్కారాలు, యోగసనాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీపీ క్లస్టర్ సూపరింటెండెంట్ ఎం.కాంతికుమార్, ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యనారాయణ, పి.సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో రథసప్తమి వేడుకలు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహరావు సూర్యభగవానుడి విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం సూర్య నమస్కారాలు చేశారు.



టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూర్యనమస్కారాలు చేస్తున్న ప్రజలు



ఏయూ యోగా విలేజ్‌లో యోగాసనాలు వేస్తున్న యువతీ, యువకులు



ప్రసంగిస్తున్న ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహరావు

నో ఎంట్రీ.. వాహనదారుల తికమక

సీతమ్మధార : ఆశీలమెట్ట జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న సబ్‌వే వద్ద నో ఎంట్రీ బోర్డుతో వాహనచోదకులు తికమక పడుతున్నారు. జీవీఎంసీ ఏర్పాటు చేసిన సబ్‌వే వద్ద మొదట్లో వన్‌వే ట్రాఫిక్ అమలులో ఉండటంతో, అప్పట్లో నో ఎంట్రీ బోర్డు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో కొన్ని సంవత్సరాలుగా రెండు వైపులా రాకపోకలు అనుమతించడంతో వాహనాలు ప్రయాణిస్తున్నాయి. కాని, నగరానికి కొత్తగా వచ్చేవారు ఇక్కడ నో ఎంట్రీ బోర్డు చూసి కంగుతింటున్నారు. రామాటాకీస్ మీదుగా వస్తూ పాత జైలురోడ్డు జంక్షన్‌కు వెళ్లే వాహనాలు సబ్‌వే నోఎంట్రీ బోర్డు దిగువ భాగం మీదుగా వెళ్తుంటాయి. అలాగే, పాత జైలురోడ్డు జంక్షన్ నుంచి సబ్‌వే మీదుగా రామాటాకీస్ రోడ్డువైపు వాహనాలు వస్తుంటాయి. ఈ సబ్‌వే మార్గం సగం త్రీటౌన్, మిగిలిన సగభాగం ద్వారకా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి వస్తుంది. సబ్‌వేలో డివైడర్లు కూడా లేకపోవడంతో ట్రాఫిక్ గందరగోళంగా ఉండడం తెలిసిందే. ఈ బోర్డు కారణంగా తికమక పడుతున్న వాహనచోదకులకు ఉపశమనం కలిగేలా జీవీఎంసీ అధికారులు వెంటనే ఈ బోర్డు తొలగించాలని వాహనచోదకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



సబ్‌వే వద్ద ఉన్న నో ఎంట్రీ బోర్డు

బెంచీలు ఇలా.. సేద తీరేదెలా?





విశాఖ పేరు చెప్పగానే ప్రతీ ఒక్కరికి గుర్తు వచ్చేది సాగర తీరం. సువిశాల తీరంలో, ఇసుక తిన్నెలపై సేద తీరడం, రోడ్డు పక్కనే బెంచీలపై కూర్చుని సాగర తీరాన్ని చూస్తూ ఆస్వాదించడం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. ఇటువంటి అనుభూతిని ఆస్వాదించే వసతులు మాత్రం సాగర తీరంలో అంతంతమాత్రంగానే ఉన్నాయి. వేలాది మంది పర్యాటకులు బీచ్ రోడ్డులో సాయంత్రం వేళ సేదతీరాలని వస్తే కనీస సదుపాయాలు సైతం మృగ్యమవుతున్నాయి. రామకృష్ణా బీచ్ నుంచి వైఎంసీఏ కూడలి వరకు ఉన్న తీరంలో అనేక ప్రధాన ఆకర్షణలు, సందర్శనీయ ప్రదేశాలు అడుగడుగునా ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పర్యాటకులు, నగర వాసులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తారు. ఇటువంటి సందర్భంలో అలసిన వారు కాసేపు కూర్చుందామంటే తగిన వసతులు లేని పరిస్థితి. మత్స్య దర్శిని నుంచి వైఎంసీఏ వరకు ఉన్న ప్రాంతంలో దాదాపు వందకు పైగా బెంచీలు ఉన్నాయి. రాతితో చేసినవి మినహా, సిమెంట్ బెంచీలలో అధికశాతం శిథిలమయ్యాయి. ఈ బెంచీలపై కూర్చుంటే సేదతీరడం దేవుడెరుగు.. గాయాల పాలయ్యేలా ఉంది పరిస్థితి. బెంచీలు విరిగిపోయి వీటిలో ఉన్న ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. నిత్యం వాకింగ్‌కు వచ్చే వృద్ధులు కాసేపు సేదతీరడానికి సైతం అనువైన స్థలం లేక ఇబ్బంది పడే పరిస్థితి. పర్యాటకానికి పెద్దపీట వేస్తామని పదే పదే చెబుతున్న పాలకులు కనీస సదుపాయాల కల్పనలో చూపిస్తున్న శ్రద్ధ ఇదేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. – ఏయూక్యాంపస్







కుటుంబం చెంతకు వృద్ధుడు



అప్పలస్వామిని కుమారుడికి అప్పగిస్తున్న మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార: విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన పూసరెడ్డి అప్పలస్వామి (68) గత నెల 26న నగరంలోని ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో భిక్షాటన చేస్తుండగా ఏయూటీడీ ప్రతినిధులు గమనించి షెల్టర్ హోంకు తరలించారు. అతని చిరునామా తెలుసుకుని మంగళవారం భోగాపురం దగ్గరలో గల పెదసుబ్బవానిపాలెంలోని కొడుకు అప్పారావుకి అప్పగించారు.